క్లుప్తంగా

వైఎస్సార్ రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

విజయపురం (నగరి) : మండలంలో వైఎస్సార్ రైతు భరోసాకు అర్హత కలిగిన రైతులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారిణి రజనికుమారి గురువారం కోరారు. అలాగే ఈకేవైసీ చేసుకోవాలని, మరిన్ని వివరాలను ఆర్‌బీకే కేంద్రంలోని సిబ్బంది సంప్రదించాలన్నారు.

పంటల పరిశీలన

విజయపురం (నగరి) : రసాయనిక ఎరువులు తగిన మోతాదులో వేసుకోవాలని చిత్తూరు ఏడీఏ సౌభాగ్యలక్ష్మి సూచించారు. విజయపురం, జగన్నాథపురంలో రైతులు సాగు చేసిన వరి, చెరకు, వేరుశనగ పంటలను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. అలాగే సాగుకు ముందు పంటలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భూసార పరీక్ష, విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి రజనికుమారి పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 265 మంది ఎంపిక



నియామక పత్రాలను అందజేస్తున్న ఉమామహేశ్వర్

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీవిద్యా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. 16 ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు 467 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 265 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను కళాశాల చైర్మన్ జి.ఉమామహేశ్వర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్, కళాశాల ప్రిన్సిపాళ్లు ఎం.మాణిక్యం, డాక్టర్ రవివర్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు

పాలసముద్రం : విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్య అవసరమని సర్పంచ్ గాలి మహేష్ బాబు తెలిపారు. మండలంలోని శ్రీకావేరిరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం శ్యామలమ్మ అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనికి హాజరైన సర్పంచ్ గాలి మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫామ్, బూట్లు, టై, బెల్ట్, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి అన్నిరకాల వస్తువులు ఉచితంగా అందిస్తోందని చెప్పారు. అనంతరం విద్యార్థులందరూ కలిసి సరస్వతి పూజ చేశారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



పాఠశాలకు ప్రింటర్, స్పీకర్, చిత్రపటాలు ఇస్తున్న పూర్వ విద్యార్థులు

నిండ్ర : తమ ఉన్నతి బాటలు వేసిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించారు పూర్వ విద్యార్థులైన తిరుపతి అర్బన్ ఎంఈఓ హస్తి ప్రభాకర్‌రాజుతోపాటు హెచ్.శ్యామల, హెచ్.యుగంధర్ రాజు. మండలంలోని ఎంఎస్‌వీఎం పురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వీరు చదివారు. శుక్రవారం ఆ స్కూలుకు వచ్చిన వారు హెచ్‌పీ ప్రింటర్, అహుజ మైక్‌సెట్‌తో పాటు శ్రీనివాస రామానుజన్, సీవీ రామన్ చిత్రపటాలను అందజేశారు. వారిని ఎంఈఓ నారాయణ, ఎంపీపీ దీప సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.నాదముని, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ఉష, నాగలాపురం ఎంఈఓ బాబయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంపూర్ణ శతావధానం ఆరంభం

చిత్తూరు రూరల్: హరివిల్లు లలిత కళావేదిక, శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సంపూర్ణ శతావధానం కార్యక్రమం చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైంది. వివిధ వర్ణనల పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు శతావధాని ఆముదాల మురళి దీటుగా సమాధానమిచ్చారు. తెలుగు సాహితీ ప్రక్రియలు, వివిధ విశేషణాలపై అవధాని వివరణలిచ్చారు. మరో రెండు రోజులపాటు శని, ఆదివారాల్లోనూ అవధానం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఆనందరెడ్డి, పార్థసారథినాయుడు పాల్గొన్నారు.

మలేరియాకు ముకుతాడు

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- నాలుగేళ్లుగా మలేరియా కేసులు నిల్



ఎంఎన్ కండ్రిగలో ఫాగింగ్ చేయిస్తున్న సబ్‌యూనిట్ అధికారి

నగరి : దోమ పుట్టకూడదు... పుట్టినా కుట్టకూడదు– అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గుడ్డు దశలోనే దోమలు పుట్టకుండా నిర్మూలన చర్యలు తీసుకుంటోంది. ఒక వేళ దోమలుగా మారినా వాటిని సంహరించేందుకు పూనుకుని దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికడుతోంది. ముఖ్యంగా ప్రాణాంతకమైన మలేరియా దోమలను దాదాపుగా నిర్మూలించే స్థితికి వచ్చింది. నియోజకవర్గంలో ఒక ఏరియా ఆస్పత్రి, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, 27 సబ్‌సెంటర్లు, 48 వెల్‌నెస్ సెంటర్లు, మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో మలేరియావ్యాప్తి నిర్మూలనకు అవసరమైన చర్యలను మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో తీసుకుంటున్నారు. ఏదైనా జ్వరం కేసు గుర్తిస్తే ఆ వ్యక్తికి రక్తపరీక్షలు చేస్తున్నారు. మలేరియా అని నిర్ధారణ అయితే అతనికి అవసరమైన మందులు అందజేస్తారు. దీంతో పాటు కేసు నమోదైన వ్యక్తి ఇంటికి చుట్టుపక్కల 50 ఇళ్లలో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహిస్తారు.ఈ చర్యల ఫలితంగా గత నాలుగేళ్లుగా నియోజకవర్గంలో మలేరియా కేసులు నమోదుకాకపోగా ఈ ఏడాది ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లోను మలేరియా కేసు నమోదు కాలేదు. అయినా అధికారులు నిత్యం అవసరమైన ప్రాంతాల్లో దోమల నివారణ ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నివారణ చర్యలు ఇలా...

- ఇళ్ల పరిసరాల్లో దోమలు పెరిగేందుకు అనువుగా ఉంటే నీటి నిల్వలను నిర్మూలించాలి.
- తాగి పారేసిన కొబ్బరిబోండాలను ముక్కలుగా చేసి చెత్తకుండీలో వేయాలి.
- ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటినిల్వ పాత్రలను, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు లాంటి వాటిని పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలి.
- కాలువల్లో వ్యర్థాలు, చెత్త, చెట్లకొమ్మలు వేయరాదు.
- వారానికోసారి పూలతొట్టెలు, పూలకుండీలలో నీరు మార్చాలి. నీరు నిల్వ ఉండ కుండా చూడాలి.
- దోమలు ఇంటి లోపలికి రాకుండా కిటికీలకు సన్నజాలీని కట్టాలి. దోమతెరలు తప్పనిసరిగా వాడాలి.
- టైర్లు, రోడ్డుపై గుంతలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.
- జ్వరం వచ్చిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- ఉదయం. సాయంత్రం సమయాల్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి.

నియోజకవర్గంలో మలేరియా కేసులు

సంవత్సరం	పరీక్షలు	కేసులు
2017	28275	6
2018	28365	5
2019	28626	0
2020	13409	0
2021	28461	0
2022	28289	0
2023	6325	0

చర్యలు తీసుకుంటున్నాం



ఇప్పటి నుంచి వర్షాలు ప్రారంభమయ్యే జూన్ నాటికి దోమలు పుట్టకుండా, వృద్ధి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పైరిత్రమ్, డీటీటీ స్ప్రేయింగ్, ఐఆర్ఎస్ మందులు చల్లేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో నీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నాం. 2030 నాటికి దేశంలోనే మలేరియా ఉండకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోంది.

– మోహన్‌బాబు, సబ్‌యూనిట్ ఆఫీసర్, నగరి

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం



మలేరియా కేసులు లేవని జ్వరాన్ని తేలిగ్గా తీసుకుంటే అది మలేరియాగా మారి ప్రాణాంతకంగా మారొచ్చు. ముందస్తు చర్యలు ముఖ్యం. మలేరియా దోమకాటుకు గురైన ఏడు నుంచి 18 రోజుల మధ్య వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ప్లాస్మోడియం సూక్ష్మజీవులు శరీరంలోకి చేరిన వారం, పది రోజుల వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. ఈ సమయంలో అవి తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయి. తర్వాత అవి ఎర్ర రక్తకణాల్లోకి ప్రవేశిస్తాయి. రక్త హీనతకు దారితీస్తుంది. సరైన సమయంలో చికిత్స పొందాలి.

– రమేష్‌బాబు, మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, బుగ్గ అగ్రహారం

నిర్మాణ పనులు పూర్తి చేయాలి



నిర్మాణ పనులపై మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం : మండల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. ఆయన శుక్రవారం బాలకృష్ణాపురం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మంజూరైన ఇళ్లు, పూర్తయిన నిర్మాణాలు తదితర వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోందని, ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్ ఇస్తున్నదని చెప్పారు. ఈ నిర్మాణాలన్నీ పూర్తి చేయించాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరు అస్టెంట్, వలంటీర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని అలంకరించారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కార్వేటినగరం: స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీపోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ పద్మసునంద తెలిపారు. ఆమె శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మే 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కార్వేటినగరం ఐసీడీఎస్ కార్యాలయానికి అందజేయాలన్నారు.

ఖాళీలు ఇలా

కార్వేటినగరం మండలం

ఎల్ఆర్ పేట అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ–ఏ)
జగన్నాథపురం అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్టీ), హెల్పర్(ఎస్టీ)
కార్వేటినగరం ముస్లిం కాలనీ హెల్పర్ (ఓసీ)

వెదురుకుప్పం మండలం

కురివికుప్పం అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ)
ఎంఎం కండ్రిగ హెల్పర్ (ఓసీ)

శ్రీరంగరాజపురం మండలం

బోడిదేవరపల్లె హెల్పర్(ఓసీ)

పాలసముద్రం మండలం

టీఆర్ పురం హెల్పర్(ఓసీ)

అంగన్‌వాడీ పోస్టుకు..

విజయపురం (నగరి): మండలంలోని ఇల్లత్తూరు ఎస్టీ కాలనీ మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శోభారాణి గురువారం తెలిపారు. ఈ నెల 29 నుంచి మే 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే మహిళ కనీసం 10 పాసై, స్థానిక కోడలుగా ఉండాలని, పూర్తి చేసిన దరఖాస్తులను పిచ్చాటూరు సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు సీడీపీఓ (8317566854)ను సంప్రదించాలన్నారు.

నగరిలో..

నగరి : ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలో 2 పోస్టులు, మండలంలో 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీకేఆర్‌పురంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్టీ)1, అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్టీ)1, గుండ్రాజుకుప్పం దళితవాడలో అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ)1, అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ) 1, మున్సిపల్ పరిధిలో గాంధీనగర్‌లో అంగన్‌వాడీ సహాయకురాలు (ఓసీ) 1, టీఆర్ కండ్రిగ అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ–బి) 1 ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై స్థానిక వివాహిత అయి ఉండాలన్నారు. 21–35 ఏళ్లలోపు ఉండాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్, రేషన్‌కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి జతపరచాలన్నారు. శనివారం నుంచి మే 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నగరి ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



బహుమతులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు, ఎంఈఓ, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు

నగరి : మున్సిపల్ పరిధిలోని నెత్తం కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి సెలవులలో సమయం వృథా చేయకుండా తెలుగు, ఆంగ్ల భాషలపై పట్టు సాధించాలని, గణితం సైన్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్ట్ వర్కులు పూర్తి చేయాలన్నారు. వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కౌన్సిలర్లు దేవరాజులు, రమేష్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. దాతలు రామలింగం, గుర్రం సునీత, జైకుమార్‌ను ప్రధానోపాధ్యాయులు నాదముని ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దొమ్మరాజు వెంకమరాజు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయరూ!



స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరిగతిన పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ 21వ వార్డు చినరాజుకుప్పం, చెర్లోపల్లె, రాజులకండ్రిగ, 25వ ఈశ్వరగుడి, బజారు, పిళ్లారికోయిల్ వీధుల్లో ఆయన పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుసుకున్నారు. వాటికి టెండర్లు ఆహ్వానించాలని సూచించారు. అలాగే వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్ఓ దిలీప్‌మొదలి, కౌన్సిలర్లు నరసింహారావు, ఏకాంబరం, జాన్ కెనడీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరత్నం యాదవ్, వెంకటేశన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, జనార్ధన్ యాదవ్, పద్మనాభం, గోపాల్, నారాయణరెడ్డి, సోముసుందరం, మస్తాన్, శివయ్య, మునయ్య, బుజ్జి, నవీన్, రాఘవశెట్టి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనకు ప్రజల బ్రహ్మరథం



పుత్తూరు రూరల్ : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కార్వేటినగరం : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వరమంగళం సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందస్వామినాయుడు ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నవరత్నాలతో అర్హత కలిగిన కుటుంబాలకు సంక్షేమ పథకాల ఫలాలను సీఎం చేరుస్తున్నారని వివరించారు. కుల మతాలకు, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఇంటికీ రూ.3 లక్షల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందస్వామినాయుడు హేమాద్రి, దాసు, రంజిత్, యోగి, మనోజ్, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

విజయపురం మండలంలో..

విజయపురం (నగరి): మండలంలోని కలియంబాకంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ విద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అందరి ఆశీస్సులు వైఎస్సార్‌సీపీకి ఇవ్వాలని కోరారు. అనంతరం 8296082960, నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌బీకే చైర్మన్ శేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మా ధైర్యం జగనన్నే

కార్వేటినగరం: దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నే మా భవిష్యత్, జగనన్నే మా ధైర్యం అంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని డిప్యూటీ సీఎం స్వగ్రామం పాదిరికుప్పంలో జగనన్నే మా భవిష్యత్తు, నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించి, స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఎంపీటీసీ ధన్‌రాజ్, సర్పంచ్ ధనంజయవర్మ, పాదిరికుప్పం ఉప సర్పంచ్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన టీచర్‌కు సన్మానం



ప్రసాద్‌ను సన్మానిస్తున్న మండల విద్యాశాఖాధికారి విజయకుమార్

కార్వేటినగరం: మండల పరిధిలోని నిశ్శంకదుర్గం ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన ప్రసాద్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు సత్కరించారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ సన్మానానికి ఎంఈవో ఎం.విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసాద్ సేవలను కొనియాడారు. పదోన్నతిపై టీకేఎం పేట ఉన్నత పాఠశాలకు వెళ్లుతున్న ప్రసాద్ ప్రతి విద్యార్థి విషయంలో ప్రత్యేక చొరవ చూపారని చెప్పారు. ఆంగ్లంలో రాయడం, చదవడం, మాట్లాడడం నేర్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆంగ్ల పాఠ్య పుస్తక రచయితగా మండలానికే వన్నె తెచ్చారని ప్రశంసించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు పలువురు శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. డీఎం పురం హెచ్‌ఎం నమశ్శివాయ, ఏఈ నాగభూషణం, హెచ్‌ఎం సురేష్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ బాబు, దుర్గం యువత పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుకున్న కూలీలతో అధికారులు

పాలసముద్రం : ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. తిరుమశరాజుపురం పంచాయతీలో శుక్రవారం పనులు చేస్తున్న కూలీలకు సర్పంచ్ జీవిత, ఏపీఓ బాల ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏపీఓ బాల మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాల్సిన బాధ్యత సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని తెలిపారు.

విద్యతో ఉన్నత శిఖరాలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : విద్య..జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి దోహదం చేస్తుందని, ఆ దిశగా విద్యార్థులు చదవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు వై. రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరి మున్సిపాలిటీ ఏకాంబరకుప్పం ఎంపీపీఎస్‌లో ఎంఈఓ శ్రీదేవి అధ్యక్షతన 1, 5 తరగతుల వారికి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఎంఈఓ మాట్లాడుతూ, చిన్నారులను విద్యార్జన దిశగా ప్రోత్సహించడానికి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల డైరీలకు గాను రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.15 వేలను రామ్‌ప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఎంఈఓ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భూపాలన్, ప్రధానోపాధ్యాయులు హరిదాసు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బిర్యానీ

నగరి : విద్యా సంవత్సరంలో చివరి రోజున సత్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అరుణాచలం విద్యార్థులు, ఉపాధ్యాయులకు బిర్యానీ పెట్టారు. వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, నేత అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షులు కన్నాయిరం, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, నాయకులు అయప్పన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి : పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ

వడమాలపేట : మండలంలో 2021–22 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేసిన అన్ని పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ)నిర్వహించనున్నట్లు ఏపీఓ సుజాత తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

జూన్ 12లోపు నాడు-నేడు పనులు పూర్తిచేయాలి



నాడు–నేడు మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

నగరి : నాడు–నేడు పనులు జూన్ 12లోపు పూర్తిచేయాలని గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం విభాగం ఎస్ఈ పి.శంకర్ బాబు ఆదేశించారు. వివిధ పథకాల పనుల పురోగతిపై శుక్రవారం నగరి సబ్‌డివిజన్ కార్యాలయంలో నగరి, నిండ్ర, విజయపురం ఏఈలు, డీఈఈలతో ఆయన సమీక్షించారు. నగరి, విజయపురం మండలాల్లో చేస్తు నాడు–నేడు పనులను పర్యవేక్షించారు. తాగునీరు, వంటగది, మేజర్–మైనర్ రిపేర్లు, టాయిలెట్ నిర్మాణం, పెయింటింగ్, విద్యుత్ మొదలైన వంటి ప్రాధాన్యత పనులను జూన్–12 లోపు పూర్తి చేసి విద్యార్థులకు పాఠశాలలను సౌకర్యవంతం చేయాలన్నారు. నాడు–నేడు పనులకు రివాల్వింగ్ ఫండ్ ఖర్చుచేసే కొద్దీ తిరిగి జమ అవుతుందన్నారు. నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరవుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన పనులను, జల జీవన్ మిషన్ కింద మంజూరైన రక్షిత నీటి సరఫరా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పనులకు నిధులు కొరత లేదని స్పష్టం చేశారు. ప్రతి సచివాలయం వద్ద ఎస్‌బీఎం నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను కూడా పూర్తి చేయాలన్నారు. డీఈఈ యంఆర్. సతీష్ కుమార్ ఏఈలు ఆర్.శైలేంద్ర, కెవి.శ్రీకాంత్, కె.అంజేరయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతంగా నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. ఈ శిబిరాల నిర్వహణపై శుక్రవారం కమిషనర్ ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. అరుణ మాట్లాడుతూ, వేసవిలో సెలవులు, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులు, యువత, మహిళల కోసం ఈ వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు నిర్దేశించిన కోర్సుల్లో ఉత్తమ శిక్షణ అందించాలని ఆదేశించారు. శిక్షణ కోసం ఇప్పటికే 600 మంది రిజిస్టర్ చేసుకున్నారని, శిక్షణ వివరాలను వీరికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం గోపి, కోర్సుల నిర్వాహకులు పాల్గొన్నారు.